సాక్షి
కుమురం భీం

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024

నేటి నుంచి ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరణ

సాక్షి, ఆసిఫాబాద్: జైనూర్‌లో బుధవారం జరిగిన ఘర్షణలతో జిల్లావ్యాప్తంగా నిలిచిపోయిన ఇంటర్నెట్ సేవలు అధికారులు పునరుద్ధరించనున్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, కెరమెరి, వాంకిడి, తిర్యాణి మండలాలు మినహా మిగిలిన తొమ్మిది మండలాల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఉన్నతాధికారికి లేఖ పంపించారు. ఇంటర్నెట్ నిలిచిపోవడంతో జిల్లాలో మీసేవ కేంద్రాలు, రేషన్ పంపిణీ ఇతర సేవలకు అంతరాయం కలిగిన విషయం తెలిసిందే.

గరిష్టం/కనిష్టం
31.1 /25.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు మొక్క అందిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ నూతన సబ్ కలెక్టర్‌గా శ్రద్ధా శుక్లా శుక్రవారం పట్టణంలో బాధ్యతలు స్వీకరించారు. 2021– 22 బ్యాచ్‌కు చెందిన శ్రద్ధా శుక్లా శిక్షణ పూర్తి చేసుకుని సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. పేద ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్‌గా శుక్రవారం శ్రద్ధాశుక్లా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు మొక్క అందించారు. జిల్లాకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, ఎల్కపల్లి రైతు వేదికల్లో పలువురు లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు కల్యాణలక్ష్మి పథకం చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 33 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, పీహెచ్‌సీ వైద్యాధికారి హర్షిన్, నాయకులు మధుకర్, నగేశ్, ప్రభాకర్, శ్రీనివాస్, సంతోష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వెల్‌కం.. గణేశా

- నేటి నుంచి వినాయక నవరాత్రులు ప్రారంభం
- వాడవాడలా మండపాలు ముస్తాబు
- పటిష్ట బందోబస్తు కల్పించనున్న పోలీసుశాఖ
- జిల్లావ్యాప్తంగా 1200 వరకు సీసీ కెమెరాల ఏర్పాటు

ఆసిఫాబాద్‌అర్బన్/కౌటాల/రెబ్బెన/కాగజ్‌నగర్ రూరల్: బొజ్జ గణపయ్య కైలాసం నుంచి నవరాత్రుల కోసం భూమిపై అడుగు పెట్టనున్నాడు. తొమ్మిది రోజులపాటు భక్తుల పూజలు అందుకోనున్నాడు. వినాయక చవితి నేపథ్యంలో శనివారం వాడవాడలా గణనాథుడు కొలువుదీరనున్నాడు. ఇప్పటికే ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించే కమిటీల సభ్యులు మండపాలు సుందరంగా తీర్చిదిద్దారు. జైనూర్ ఘటన నేపథ్యంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 1000కి పైగా మండపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జిల్లా ప్రజలు ఆసిఫాబాద్, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, చంద్రపూర్ నుంచి భారీ విగ్రహాలు కొనుగోలు చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్‌ఏరియాలో పూజాసామాగ్రి అమ్మకాలతో సందడిగా మారింది. నిత్యపూజలు, అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భక్తులను ఆకర్షించేందుకు లక్కీడీప్‌ల ద్వారా బహుమతులు అందించనున్నారు.

పర్మిషన్ తప్పనిసరి



కాగజ్‌నగర్‌రూరల్: భారీ విగ్రహం తీసుకెళ్తున్న యువకులు

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వినాయక మండపాల నిర్వాహకులతో శాంతి సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. పోలీస్ పోర్టల్ https://policeportal.tspolice.gov.in లో మండపాల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. జియో ట్యాగింగ్ విధానం అమలు చేయనున్నారు. దరఖాస్తుల ఆధారంగానే పోలీసు సిబ్బంది మండపం ఫొటోలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గణేశ్ ఉత్సవాల కోసం 800 మంది అధికారులు, సిబ్బందితో పోలీసుశాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనుంది. జిల్లావ్యాప్తంగా 1200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండపాల వద్ద మద్యం తాగడం, పేకాట, అసభ్యకర నృత్యాలు నిషేధించారు. అలాగే ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకే సౌండ్ సిస్టంకు పర్మిషన్ ఉంది. 24 గంటలపాటు ఉండేలా వలంటీర్లను నియమించాలి. డీజేలపైనా నిషేధం విధించారు.



కౌటాలలో అమ్మకానికి సిద్ధంగా విగ్రహాలు



రెబ్బెన: నేతాజీ గణేశ్ మండలి ఆధ్వర్యంలో..



కౌటాలలో గణనాథుడు

నిబంధనలు పాటించాలి

వినాయక చవితి ఉత్సవాలు ప్రజలందరూ శాంతియుతంగా జరుపుకోవాలి. మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. 800 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. ఎలాంటి సందేహాలున్నా డయల్ 100ను సంప్రదించాలి.

– డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ



రెబ్బెన: ఎన్టీఆర్‌నగర్‌లో మండపం సిద్ధం చేస్తున్న యువకులు



కాగజ్‌నగర్‌రూరల్: పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



రెబ్బెన: వినాయకుడి విగ్రహాన్ని ఆటోలో తీసుకెళ్తున్న భక్తులు

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం రాజకీయ నాయకులు, మతపెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగల నేపథ్యంలో సామరస్యంగా వేడుకలు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వినాయక మండపాల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని, విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. మండపాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పట్టణ సీఐ శంకరయ్య పాల్గొన్నారు. అనంతరం వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే పెద్దవాగు వద్ద స్థలాన్ని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పరిశీలించారు. రెండు క్రేన్‌లు ఏర్పాటు చేసి సరిపడా సిబ్బందిని కేటాయించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

హద్దుల గుర్తింపు ఎప్పుడో..?



నిర్మాణ పనులు అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులు(ఫైల్)

- ఎల్కపల్లి శివారులో వివాదాస్పదంగా సర్వే నం.61
- రెవెన్యూ, అటవీశాఖల మధ్య తేలని హద్దులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో ప్రభుత్వ, అటవీశాఖ భూముల హద్దులను గుర్తించేందుకు అధికారులు పలుమార్లు ఉమ్మడి సర్వేలు చేపట్టినా నేటికీ హద్దులు మాత్రం గుర్తించలేదు. అటవీభూముల్లో ఇళ్లు నిర్మిస్తున్నారని అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. ఫలితంగా ఘర్షణ వాతావరణం నెలకొంటుంది. ఇటీవల ఎల్కపల్లిలో ఓ ఇంటి నిర్మాణ పనులను అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపైఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

ఇది వివాదం..

ఎల్కపల్లి శివారులోని సర్వే నం.61లో సుమారు 1,346 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇదే సర్వే నంబరులో ఎల్కపల్లి, సంజీవనగర్ గ్రామాలు ఉన్నాయి. అక్కడ ప్రభుత్వం నిరుపేద రైతులకు పట్టాలు మంజూరు చేయగా సాగు చేసుకుంటున్నారు. సర్వే నం.61లో కడంబా బ్లాక్‌లోని కంపార్టుమెంట్ 155లో అటవీశాఖకు 460 హెక్టార్ల భూమి ఉందని ఫారెస్టు అధికారులు వాదిస్తున్నారు. ప్రధాన రహదారికి ఎడమ వైపు నూతన కట్టడాలను అడ్డుకుంటున్నారు. దీనిపై గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు హద్దులు గుర్తించేందుకు సర్వేలు చేశారు. సర్వే పూర్తికాక హద్దులు గుర్తించలేదు.

కేసులు నమోదు చేస్తున్న అటవీశాఖ

పెంచికల్‌పేట్– సలుగుపల్లి ప్రధాన రహదారిలో ఎడమ వైపు నిర్మాణాలు చేపడుతున్న పలువురిపై అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. నాలుగేళ్లుగా నిర్మాణాలు అడ్డుకుంటూ అటవీ భూమి పేరుతో కేసులు నమోదు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఆరు నెలల క్రితం పాత ఇంటి స్థలంలో నూతన ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించగా అధికారులు అడ్డుకున్నారని గ్రామానికి చెందిన పోలోజు రాజమౌళి వాపోయాడు. 2022లో ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించి పట్టా మంజూరు చేసిందని ఆయన తెలిపాడు.

నిర్మాణాలు చేపడితే చర్యలు

సర్వే నం.61లో అటవీశాఖకు భూమి ఉంది. కంపార్ట్‌మెంట్ 155 సర్వే నం.61లోనే ఉంది. సర్వే పూర్తయ్యేవరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని సూచించాం. అటవీ భూముల్లో నిర్మాణాలను చేపడితే చర్యలు తీసుకుంటాం.

– అనిల్‌కుమార్, ఎఫ్‌ఆర్‌వో, పెంచికల్‌పేట్

దారి కోసం శ్రమదానం



జిల్లాలోనే అత్యంత మారుమూల ప్రాంతాల్లో తిర్యాణి మండలం గుండాల గ్రామం ఒకటి.. దండేపల్లి మండలం ఊట్ల గ్రామం నుంచి గుండాలకు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. కనీసం నడిచేందుకు కూడా వీలు లేకపోవడంతో గ్రామస్తులు శుక్రవారం శ్రమదానం చేసి రహదారిని పునరుద్ధరించారు. కార్యక్రమంలో మర్సుకోల అశోక్, కాంతారావు, కుంరం చందు, పెందుర్ రాహుల్, సోము తదితరులు ఉన్నారు. - తిర్యాణి

పోలీసుల ప్రేక్షకపాత్ర!

- విధ్వంసం అడ్డుకునే యత్నం చేయలేదు..
- చెలరేగుతున్న వారిని నిలువరించలేదు
- 120కి పైగా దుకాణాలు ధ్వంసం.. అగ్నికి అహుతి
- ప్రభుత్వానికి నివేదించిన ఏడీజీ, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- రూ.38.52 కోట్ల ఆస్తినష్టం జరిగిందంటున్న దుకాణాదారులు



వివరాలు నమోదు చేస్తున్న రెవెన్యూ అధికారులు



దుకాణాల నుంచి సామగ్రి తీసుకెళ్తున్న యజమానులు

సాక్షి, ఆసిఫాబాద్: 'ఇరువర్గాలు చెలరేగిపోయి ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్నా వీక్షిస్తూ ఉండటం.. నిలువరించడానికి ఎలాంటి చర్యలు చేపట్టకుండా జిల్లా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడంతోనే జైనూర్ పట్టణంలో బుధవారం హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 120కి పైగా దుకాణాలు ధ్వంసమయ్యాయి. 18 వాహనాలు అగ్నికి అహుతయ్యాయి. రూ.20 కోట్ల వరకు ఆస్తినష్టం వాటిల్లి ఉండొచ్చు..' అంటూ శాంతిభద్రత విభాగం అదనపు డీజీ మహేశ్ భగవత్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే వేర్వేరుగా ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినట్లు తెలిసింది. ఆందోళనకారులు బుధవారం ఉదయం నిందితుడి ఇంటిని ధ్వంసం చేసి తగలబెడుతున్న సమయంలో డీఎస్పీ సదయ్య, పోలీసులు నివారణ చర్యలు తీసుకోకపోవడంతో విధ్వంసం మొదలైనట్లు తెలుస్తోంది. తర్వాత నిందితుడి ఆటోతోపాటు రోడ్డుపై పార్కు చేసి ఉన్న మరో కారును తగలబెట్టారు. ఆ సమయానికి ఎస్పీ డీవీ శ్రీనివాసరావు జైనూర్‌కు చేరుకున్నారు. చినికిచినికి గాలివానగా మారే అవకాశం ఉన్న సమయంలో జిల్లా ఎస్పీ చొరవదీసుకుని ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేయకపోవడంతో వారు మరింత రెచ్చిపోయినట్లు సమాచారం. తమ దుకాణాలను బద్దలుకొట్టి సామగ్రిని బయటపడేసి తగలబెట్టారన్న ఆక్రోశంతో మరో వర్గానికి చెందిన వారు మధ్యాహ్నం 2 గంటల సమయంలో మూడో వర్గానికి చెందిన దుకాణాలను లక్ష్యంగా చేసుకుని షట్టర్లను పగలగొట్టి పెట్రోల్, డీజిల్ పోసి నిప్పంటించారు. అప్పుడు సైతం పోలీసులు మౌనపాత్ర వహించడం మినహా చేసిందేమీ లేదని తేలింది. ఎస్పీ, డీఎస్పీల నిర్లక్ష్యంతోనే పరిస్థితి అదుపుతప్పిందని ఉన్నతాధికారులు తమ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది.

అపార ఆస్తినష్టం

ఇరువర్గాల ప్రతీకార చర్యలతో జైనూర్‌లో అపార ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తోంది. 120కిపైగా దుకాణాలు ధ్వంసం కాగా.. అందులోని సామగ్రి అగ్నికి అహుతైంది. అయితే ఏ ఒక్క దుకాణానికి ఇన్సూరెన్స్ లేకపోవడం విచిత్రం. జిల్లా రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో ఆస్తినష్టం వివరాలను వెల్లడించిన దుకాణాదారులు మొత్తం రూ.38.52 కోట్ల వరకు నష్టపోయామని పేర్కొన్నట్లు తెలిసింది. అలాగే 18 వాహనాల్లో కొన్ని పాక్షికంగా.. మరికొన్ని పూర్తిగా దెబ్బతినగా.. వీటన్నింటికీ ఇన్సూరెన్స్ ఉండటం గమనార్హం. దెబ్బతిన్న వాటిలో అత్యధికంగా ద్విచక్ర వాహనాలుండగా.. మూడు ఆటోలు, ఓ టెంపో ట్రావెలర్, కారు ఉన్నాయి. ఇప్పటివరకూ 110 షాపుల యజమానులతో మాట్లాడి అధికారులు వివరాలు సేకరించారు. మరో 20 షాపుల యజమానులు అందుబాటులో లేరని తెలుస్తోంది. మొత్తంగా రూ.20 కోట్ల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని తమ నివేదికల్లో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

దుకాణాల వద్ద చెత్త తొలగింపు..

హింసాత్మక ఘటనల నేపథ్యంలో దుకాణాల ఎదుట రోడ్డుపై కాలిబూడిదైన వస్తువులు, చెత్తాచెదారాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. అలాగే షాపుల యజమానులను పిలిచి దుకాణాలను శుభ్రం చేసుకోవాలని కోరారు. ఉదయం నుంచి నష్టం వాటిల్లిన షాపుల వద్ద యజమానులు, సిబ్బంది చేరి శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఉదయం కూడా ఓ ఐరన్ దుకాణం నుంచి పొగలు రావడం గమనించిన పోలీసులు వాటిని ఆర్పే ప్రయత్నం చేశారు. బుధవారం నుంచి మొత్తం ఏడు ఫైరింజన్లను ఘటనాస్థలికి రప్పించారు.

రాజుకుంటున్న నిప్పు..

ఓ వర్గం వారు ప్రార్థనా మందిరంలోకి చొచ్చుకుపోవడాన్ని మరో వర్గం జీర్ణించుకోలేకపోయినట్లు తెలిసింది. తమ వర్గీయులతో రహస్యంగా ఏర్పాటు చేసుకున్న సమావేశంలో పలు అంశాలపై చర్చించుకున్నారు. ఈ మేరకు పొరుగు రాష్ట్రాల మతపెద్దల మద్దతు కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారు కూడా ఆర్థిక రూపేణ సాయమందిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జైనూర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసుల లాఠీచార్జి..

శుక్రవారం ప్రార్థనా మందిరాల్లో ప్రార్థనల కోసం ప్రయత్నించిన ఓ వర్గానికి చెందిన కొందరిపై ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు లాఠీచార్జి చేసినట్లు సమాచారం. ఇంట్లోనే అందరూ ప్రార్థనలు చేసుకోవాలని, ప్రార్థనా మందిరాలకు రావొద్దంటూ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. అయినా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ కొందరు బయటకు రావడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేసి చెదరగొట్టినట్లు సమాచారం.

షాపులు ఖాళీ చేసిన కొందరు వ్యాపారులు..

ఇరువర్గాల మధ్య నలిగిపోతామని భావించిన కొందరు వ్యాపారులు జైనూర్‌లోని తమ షాపులను ఖాళీ చేసి వెళ్లడం కనిపించింది. ఫర్టిలైజర్, బేకరి, టైలరింగ్, కిరాణం వంటి దుకాణాలు చాలా వరకు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇక్కడ ఉండటం శ్రేయస్కరం కాదన్న భావనతో వారు ఖాళీ చేసి ఉండొచ్చని స్థానికులు చెప్పుకుంటున్నారు. తమ కాంప్లెక్స్‌ను తగలబెట్టేందుకు ఓ వర్గం యత్నిస్తోందని చంద్రమౌళిగౌడ్ అనే వ్యాపారి జిల్లా కలెక్టర్ వద్ద గురువారం సాయంత్రం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దయచేసి వారి నుంచి తమ షాపులకు రక్షణ కల్పించాలని కోరగా.. తప్పకుండా మీకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సమాచారం.

డీఎస్పీ సదయ్యపై బదిలీ వేటు

- ఆసిఫాబాద్ డీఎస్పీగా కరుణాకర్ నియామకం

సాక్షి, ఆసిఫాబాద్: జైనూర్ హింసాత్మక ఘటనల నేపథ్యంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై పోలీసు శాఖ చర్యలకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్యపై వేటు వేసింది. కాగజ్‌నగర్‌కు ఆయనను బదిలీ చేస్తూ మల్టీజోన్– 1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేశారు. జైనూర్‌లో ఘర్షణ వాతావరణాన్ని పసిగట్టలేకపోవడం.. ఇరువర్గాలు ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నా నిలువరించే ప్రయత్నం చేయకపోవడం.. విధుల్లో నిర్లక్ష్యం వహించడం వంటి కారణాలతో ఆయనపై బదిలీ వేటు వేసినట్లు తెలిసింది. సదయ్య స్థానంలో కాగజ్‌నగర్ డీఎస్పీ ఎ.కరుణాకర్‌ను ఆసిఫాబాద్ నూతన డీఎస్పీగా బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక



ఎంపికైన మహిళా క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా తైక్వాండో కోచ్‌లు మోకనపల్లి నరేశ్, మోకనపల్లి శశిధర్ తెలిపారు. ఈ నెల 5న హైదరాబాద్‌లో నిర్వహించిన రెండవ ఖేలో ఇండియా ఉమెన్స్ తైక్వాండో లీగ్-2024లో మోకనపల్లి నాగలక్ష్మి, ఎండీ.అఫ్రీన్ కాతున్, జి.మణిప్రియ, బి.నిఖిత ప్రతిభ కనబర్చగా ఎంపిక చేశారని తెలిపారు. ఈ నెల 11 నుంచి 14వరకు తమిళనాడులోని దిండిగల్‌లో జరిగే నేషనల్ ఖేలో ఇండియా తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన వారిని తైక్వాండో తెలంగాణ సెక్రెటరీ ఏ.ప్రవీణ్ కుమార్, జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ కె.రాజ్ వీర్ అభినందించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

కడెం: మండలంలోని అల్లంపల్లి జీపీ పరిధిలోని అద్దాల తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లే జీపు శుక్రవారం అదుపుతప్పి పక్కనే ఉన్న నీటికుంటలోకి దూసుకెళ్లింది. ఉట్నూర్ నుంచి 12 మంది ప్రయాణికులతో బయలుదేరిన జీపు అల్లంపల్లి దారిలో రోడ్డుపై నుంచి అదుపుతప్పి కుంటలోకి వెళ్లి ఆగిపోయింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. మారుమూల ఆటవీ ప్రాంతంలోని అల్లంపల్లి ఉమ్మడి జీపీలో పదిపైగా గ్రామలుంటాయి. వీరు నిత్యం మండల కేంద్రంతోపాటుగా, ఉట్నూర్, జన్నారం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే పక్కా రోడ్డు లేదు. వర్షాకాలంలో రాకపోకలు సాగించాలంటే నరకయాతనే. ప్రమాదకర వాగులు, వంకలు దాటుకుంటు రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర సమయంలో అంబులెన్స్, ప్రైవేటు వాహనాలు రాక ప్రాణాలు పోయిన సంఘటనలూ ఉన్నాయి.

'కడెం'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం ప్రాజెక్టుకు 4,922 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు ఒక గేటు ఎత్తి 4,355 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు. ప్రస్తుతం 697.375 అడుగులు ఉంది.

మట్టి వినాయక @ 66



చెన్నూర్ విశ్వకర్మ కాలనీలో మట్టి విగ్రహం తయారీ

- ఆరున్నర దశాబ్దాలుగా ఏర్పాటు
- నానయ్య పంతులు దూరదృష్టి
- ఉత్సవాలు ముగిసే వరకు భజన
- నిమజ్జనంలో డీజేలు, డప్పు చప్పుళ్లు ఉండవు..



విశ్వ బ్రాహ్మణ గణేశ్ మండపం కోసం సిద్ధమవుతున్న మట్టి విగ్రహం

చెన్నూర్: ఆరున్నర దశాబ్దాల క్రితం మట్టి వినాయక ప్రతిమ ఏర్పాటుకు బీజం పడింది. ఆ ఆచారం అనాదిగా కొనసాగుతూ వస్తోంది. దూరదృష్టితో ఆలోచించి నానయ్య పంతులు వేసిన మట్టి గణపతి తయారీ పునాది నేటికీ కొనసాగుతోంది. చెన్నూర్ పట్టణంలోని విశ్వబ్రాహ్మణులు గత అరవై ఆరేళ్లుగా మట్టి గణపతిని స్వయంగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 1958 సంవత్సరంలో అకినపల్లి నానయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సమయంలో ఆయన మిత్ర బృందం లక్ష్మయ్య, మల్లయ్యలతో కలిసి మట్టి గణపతిని తయారు చేశారు. విశ్వకర్మ కాలనీలో విశ్వకర్మ గణేశ్ మండలి పేరుతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు వరకు ప్రతీరోజు రాత్రి భజన కార్యక్రమం నిర్వహిస్తారు. నిమజ్జన సందర్భంగా నలుగురు వ్యక్తులు విగ్రహాన్ని మోసుకుంటూ వెళ్లి పెద్ద చెరువులో నిమజ్జనం చేసే వారని శంకరయ్య తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు విశ్వ బ్రాహ్మణ గణేశ్ మండలి వద్ద భజన మండలి ఆధ్వర్యంలో ప్రతీరోజు భజన చేస్తారు. నిమజ్జనం రోజు డీజేలు, డప్పుచప్పుళ్లు లేకుండా భజన చేస్తూ ఊరేగింపుగా వెళ్లారు.

పెద్దల ఆలోచన అమోఘం..



66 ఏళ్ల క్రితం మా తండ్రి నానయ్య ఉపాధ్యాయుడిగా ఉంటూ ఆనాడు చేసిన ఆలోచనను మా తరంతోపాటు నేటి యువత సైతం పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకొని మట్టి విగ్రహాన్ని తయారు చేయడం సంతోషంగా ఉంది. నేడు పర్యావరణ శాస్త్రవేత్తలు సైతం మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పుతున్నా.. కొందరు పెడచెవిన పెడుతున్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అందరూ మట్టి విగ్రహాలు ఏర్పాటు చేయాలి.

– అకినపల్లి సత్యనారాయణ, చెన్నూర్

నాడు పక్షం రోజులు.. నేడు వారం రోజులు

నాడు విగ్రహం తయారు చేసేందుకు పక్షం రోజుల పాటు కష్టపడేవారు. స్వయంగా పొలాల మట్టిని తీసుకొచ్చి నియమ నిష్ఠాలతో పక్షం రోజులు మద్య, మాంసాహారాలు ముట్టకుండా తయారు చేసేవాళ్లు. ప్రస్తుతం నేటి యువకులు వినయ్‌చారి ఆధ్వర్యంలో వారం రోజుల్లో విగ్రహాన్ని తయారు చేస్తున్నారు.

పుట్టమన్ను తెచ్చి... ప్రతిమలుగా మలిచి...



పంపిణీకి సిద్ధంగా ఉంచిన వినాయక ప్రతిమలతో నర్సయ్య దంపతులు

నిర్మల్‌ఖిల్లా: అతనో పర్యావరణ ప్రేమికుడు.. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మిశ్రమంతో తయారు చేసిన గణేశ్ విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని భావించి తన వంతు బాధ్యతగా అటవీ ప్రాంతం నుంచి తెచ్చిన పుట్టమన్ను, గోమయం (ఆవు పేడ) కలిపి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నాడు. వీటిని స్థానికులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాడు. స్థానిక బంగల్‌పేట్ ప్రాంతానికి చెందిన 'పాపెన నర్సయ్య' ప్రకృతి ప్రసాదించిన పుట్టమన్ను, ఆవు పేడతో తయారుచేసిన ప్రతిమలను పూజించడం వల్లనే పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామని పేర్కొంటున్నాడు. పదేళ్లుగా హైదరాబాదులోనూ పంపిణీ చేసినట్లు చెబుతున్నాడు. మట్టి గణపతినే ప్రతిఒక్కరూ ప్రతిష్ఠించి, పూజించాలని కోరుతున్నాడు. వినాయ క చవితి పర్వదినం నేపథ్యంలో ఉచితంగా గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తూ, పర్యావరణ స్ఫూర్తిని చాటుతున్న పాపెన నర్సయ్య-విజయలక్ష్మి దంపతులను పలువురు అభినందిస్తున్నారు.



విగ్రహాలను తీర్చిదిద్దుతున్న నర్సయ్య

హెల్ప్ డెస్క్ ప్రారంభం



హెల్ప్‌డెస్క్ ప్రారంభిస్తున్న గని మేనేజర్

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 3 గనిలో ఉద్యోగుల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను గని మేనేజర్ వెంకటరావు ప్రారంభించారు. గనిపై శుక్రవారం వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన, మరణించిన, అన్‌ఫిట్ ఉద్యోగుల సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యూటీ, వితంతు పెన్షన్, గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం, కారుణ్య నియామకాలు తదితర అన్ని వివరాలు ఒకే చోట పొందుపర్చామని, ఆ వివరాలన్నీ ఈ ప్రత్యేక హెల్ప్ డెస్క్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఈ సమాచారం టెర్మినల్ బెనిఫిట్స్ సెటిల్‌మెంట్ సమయంలో చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గని సంక్షేమాధికారి గౌస్‌పాషా, పిట్ కార్యదర్శి మురళీచౌదరి, అధికారులు ప్రేంకుమార్, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రామకృష్ణాపూర్: కుర్మపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమగూడెంకు చెందిన నందూలాల్(40) మృతిచెందాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైవేకు సంబంధించి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న నందూలాల్ మరో ఇద్దరు సిబ్బంది బాలుస్వామి, రంజిత్‌లతో కలిసి తెల్లవారుజామున పెట్రోలింగ్ వాహనంలో విధుల్లో ఉన్నాడు. మంచిర్యాల వైపు వెళ్తున్న ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. నందూలాల్‌కు తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. బాలుస్వామి, రంజిత్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

- ఆరుగురు మహిళలు, ఏడుగురు విటుల అరెస్ట్
- గత జూలైలో అదే లాడ్జి యజమాని అరెస్ట్

మంచిర్యాలక్రైం: జూలై 25న స్థానిక ఐబీ చౌరస్తాలోని సాయినాథ్ రెసిడెన్సి అండ్ లాడ్జిలో లాడ్జి యజమానితోపాటు ఇద్దరు యువకులు, ముగ్గురు మహిళలు వ్యభిచారం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ ఘటన ప్రజలు మరువక ముందే తాజాగా శుక్రవారం అదే లాడ్జిలో వ్యభిచారానికి పాల్పడుతున్న ఆరుగురు మహిళలు, లాడ్జి నిర్వాహకుడితో పాటు ఏడుగురు విటులను మంచిర్యాల పోలీసులు అరెస్టు చేశారు. లాడ్జి యజమాని జిల్లాలో రాజకీయంగా పేరున్న వ్యక్తి కావడం, రెండు సార్లు అదే లాడ్జిలో దందా సాగిస్తూ పట్టుబడడం చర్చనీయాంశమైంది. గత నెల 21న జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ గెస్ట్‌హౌస్‌లో ఏడుగురు విటులు, ఓ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం సాయినాథ్ రెసిడెన్సి అండ్ లాడ్జిలో వ్యభిచారం జరుగుతోందని అందిన సమాచారం మేరకు సీఐ బన్సిలాల్ సిబ్బందితో ఆకస్మికంగా మెరుపు దాడి చేశారు. ఆరుగురు మహిళలు, ఆరుగురు పురుషులు వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డారని సీఐ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బెల్లంపల్లి మండలం ఆకెనపెల్లికి చెందిన సుంకరి శివయ్య, గోదావరిఖనికి చెందిన మందాల శివ అశీష్, ఆకుల ప్రశాంత్, రౌతు కార్తీక్, లక్సెట్టిపేటకు చెందిన తిరుపతి, పెద్దపల్లి జిల్లా వెల్గటూర్‌కు చెందిన గోస్కుల ప్రశాంత్‌తోపాటు లాడ్జి నిర్వాహకుడు మోతం జనార్దన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మహిళలను సఖీ సెంటర్‌కు తరలించామని పేర్కొన్నారు. విటులు లాడ్జి నిర్వాహకుడికి చెల్లించిన రూ.6600 నగదు స్వాధీనం చేసుకున్నామని, వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్న లాడ్జి యజమాని సిరుపురం శ్రీనివాస్‌ను త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్

సింగరేణికి బకాయిలు చెల్లించాలి

నస్పూర్: సింగరేణి సంస్థకు ప్రభుత్వం బొగ్గు, విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని సింగరేణి కోల్‌మైన్స్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్ కే 5 గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం ఏళ్ల తరబడి జాప్యం చేస్తుండడంతో సంస్థ ఆర్థిక ప్రయోజనాలకు విఘాతం కలుగుతోందని పేర్కొన్నారు. అపరిష్కృత సమస్యల పరిష్కారానికి తమ సంఘం ద్వారా పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్అండ్‌పీసీ విభాగం టీబీజీకేఎస్ సహాయ కార్యదర్శి కొమ్ము బాపు బీఎంఎస్‌లో చేరగా ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి, ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, కేంద్ర కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు కట్కూరి సతీష్, బోయిన మల్లేశ్, మాదాసి రవీందర్, గూడ శ్రీకాంత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న సత్తయ్య



ఎస్టీపీపీలో సీఐఎస్ఎఫ్ మాక్‌డ్రిల్

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మల్టీ ఏజెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహించారు. అడ్మిన్ భవన కార్యాలయంలో సీఐఎస్ఎఫ్ జవాన్స్, స్థానిక స్టేట్ పోలీస్, ఎస్టీపీపీ ఫైర్ సిబ్బంది, మెడికల్ స్టాఫ్ నేతృత్వంలో మాక్‌డ్రిల్ చేపట్టారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేశ్‌పర్మార్ మాట్లాడుతూ వార్షిక మల్టీ ఏజెన్సీ మాక్‌డ్రిల్ ప్రాముఖ్యతలను వివరించారు. ఏదైనా అనుకోని సంఘటన, టెర్రరిస్టులు, మావోయిస్టులు ప్లాంటులోకి చొరబడినప్పుడు ప్లాంటు, అధికారులు, ఉద్యోగులను ఎలా కాపాడుతారనే అంశాలను చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, జీఎం శ్రీనివాసులు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీ ఎంలు ప్రసాద్, సుధాకర్, మదన్‌మోహన్, అధికారుల సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ సత్యనారాయణ, ఎస్‌వోటు ఈడీ ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యోగేశ్ పర్మార్

'జేఏసీపై ఆరోపణలు ఖండిస్తున్నాం'

మంచిర్యాలటౌన్: తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీపై పలువురు చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు జిల్లా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను మిగతా జేఏసీ భాగస్వామ్య సంఘాలు, ఉపాధ్యాయ, నాలుగవ తరగతి, పెన్షనర్ల సంఘ నేతలను సంప్రదించిన తర్వాతనే ఒకరోజు మూలవేతనం ఇవ్వాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రెండు మూడు సంఘాలతో ఏర్పాటు చేసుకున్న జేఏసీలు ఉండడం సబబు కాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, పీఆర్టీయూ(టిజి) జిల్లా అధ్యక్షుడు ధరణికోట వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవి, డీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేశ్, ఎం.జయకృష్ణ, ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు పి.వెంకటేశ్వర్లు, శంకర్ గౌడ్, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు చక్రపాణి, రాజవేణు, రాణి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న గడియారం శ్రీహరి

కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం

- చర్చనీయాంశంగా మారిన నాయకుల తీరు
- ఎమ్మెల్యే జోక్యంతో సద్దుమణిగిన వివాదం

చెన్నూర్: చెన్నూర్ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఇరువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పీఏ సమక్షంలో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఇరువురు నాయకుల తీరుపై కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెన్నూర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన వాటర్‌ట్యాంక్ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. చెన్నూర్‌కు చెందిన జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, భీమారం గ్రామానికి చెందిన చెకూర్తి సత్యనారాయణరెడ్డి మధ్య స్థానికతపై వాగ్వాదం ప్రారంభమైంది. ఒక పక్క కార్యక్రమం జరుగుతుండగా వీరు ఇరువురు గొడవ పడ్డారు. భీమారం గ్రామానికి చెందిన చేకూర్తి సత్యనారాయణరెడ్డిని చెన్నూర్‌లో జరిగే కార్యక్రమానికి ఎందుకు వచ్చావు అని మూల రాజిరెడ్డి బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. ఇది కాంగ్రెస్ సమావేశామని, తాను ఎక్కడికైనా వస్తానని, అడిగేందుకు ఎవరంటూ ఎదురు దాడికి దిగారు. దీంతో గొడవ తీవ్రమైంది. ఎమ్మెల్యే గమనించి జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది.





చలో జంతర్‌మంతర్ విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించే చలో జంతర్ మంతర్‌ను విజయవంతం చేయాలని ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని, కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణతో దళిత గిరిజనులు, బహుజనులను భయాందోళనకు గురి చేయడమే అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, నేతకాని మహర్ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు జాడి రాజేష్, వీబీఏ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంబరి ప్రశాంత్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పోతరాజుల ఆశ్విన్, జిల్లా నాయకులు మహేష్, కొండు అజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గవ్వల శ్రీకాంత్

విద్యుదాఘాతంతో రైతుకూలీ మృతి

- పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన కరెంటు తీగ తగిలి మృత్యువాత

బజార్‌హత్నూర్: అటవీ జంతువుల నుంచి పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఓ రైతు కూలీ ప్రాణం తీసింది. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అప్పారావ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాడగూడ గ్రామానికి చెందిన కొడప గంగారాం(45) గురువారం సాయంత్రం ఓ రైతు చేనులో పనులకు వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు పంట చేల వద్ద వెదికారు. ఈ క్రమంలో చిక్రం లక్ష్మణ్ చేనులో అడవి జంతువుల నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగకు తగిలి మృతి చెంది విగతజీవిగా కనిపించాడు. గంగారాం పనికి వెళ్లి వచ్చే క్రమంలో లక్ష్మణ్ చేనులో ఉన్న విద్యుత్ తీగకు తగిలినట్లుగా భావిస్తున్నారు. మృతుడి భార్య తులసీబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సాంబార్ ఎంకవ్వ(94) రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కుంటాల ఎస్సై భాస్కరాచారి కథనం ప్రకారం.. ఎంకవ్వ గురువారం రాత్రి కల్లూరులో 61 జాతీయ రహదారి దాటి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లింది. కల్లూరులో కిరాణా దుకాణంలో సరుకులు దింపేందుకు బొలెరో వాహనం భైంసా నుంచి వచ్చింది. అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం, రాంగ్‌రూట్‌లో వచ్చిన డ్రైవర్ గమనించక వృద్ధురాలిని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఎంకవ్వను 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలి మనుమడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



